



అరిగె రామారావు

తాయారమ్మకు గబుక్కున మెలకువ వచ్చింది. పక్కింటి చిట్టెమ్మగారి గొంతు తారా స్థాయిలో వినిపిస్తోంది. పాత పేపర్లు కొనేవాడినట్లుంది. దబాయించి పారేస్తోంది. చిట్టెమ్మ భర్త రోజూ ఇంగ్లీసు పేపరు తెప్పిస్తాడు. ఏరోజు పేపరును ఆరోజు దాచిపెట్టి, ఏనెలకో రెండు నెలలకో పాతపేపర్లు కొనేవాడికి అమ్ముతుంది. అలా అమ్మినప్పుడల్లా ఇదే గొడవ. ఈమె వీశకు రెండురూపాయలు కావాలంటుంది. వాడందుకు వప్పుకొని తూస్తే, తూకం సరిలేదంటుంది. వీశ రెండు రూపాయిలకు కొంటూ తూకం సరిగ్గా తూస్తే వాడికి గిట్టేదేమిటి ?....

ఈయనగారు అదేంమనిషో. పేపరు అయినా చదవరూ. ఎంతసేపూ ఆయనేమిటో, ఆయనగారి ఆఫీసు దస్త్రాలేమిటో. ఎప్పుడన్నా ఇంట్లోపని తొందరగా తెమిలి, తీరికగా వున్నప్పుడు ఏ పుస్తకమన్నా చదువుకుందామంటే, పాడు కొంపలో ఏ పుస్తకమూ వుండిచావదు. తీరికగావున్నప్పుడు చదువుకుంటానికి ఏ వారపత్రికలో కొనకూడదండీ అంటే, అదోలాగాచూచి, కథల పుస్తకాలు చదవటానికి నీవేం చిన్నపిల్లవటే అంటారు. అంతా విడ్డూరంకాకపోతే కథలపుస్తకాలు చిన్నపిల్లలే చదవాలికాబోలు. కాకపోయినా, తనేం పుస్తకాలు చదవకూడనంత వందుముత్తైదా? ఈయనదంతా చాదస్తం......

తాయారమ్మ ఆవలించి లేచి కూర్చోబోయి మళ్ళీ బద్దకంవేసి అలాగే పండుకుంది. దొడ్లో బాదంచెట్టు నీడన పిల్లలు ఆడుకుంటున్నారు. ఎదురుగుండా గదిలో పెద్దపిల్ల సరోజ ఏదో సవరిస్తూ, కూనిరాగం పాడుకుంటూ అటూ ఇటూ తిరుగుతుంది.

తాయారమ్మ కళ్ళు మూసుకుని పండుకుంది. చిట్టెమ్మగారి పేపర్లబేరం అయిపోయిందట్లుంది. అటునుంచి మాటలేమీ వినిపించటంలేదు. చిట్టెమ్మ మళ్ళీ నీళ్ళు పోసుకుంది. ఈనెల నాల్గురోజులు ఎడం అయ్యేసరికి తనకీ నెల తప్పిందనుకుంది. ఈ సంగతీ ఆయనతో అంటే, చిరాగ్గా మొగంపెట్టి, పెద్దపిల్లకూడ పెళ్ళి కెదుగుతే ఇంకా నీకు నెలతప్పటమేమిటి నాతలకాయ అన్నారు. మొన్నసాయంకాలం శివాలయానికెళ్ళితే జయలక్ష్మమ్మగారు కనిపించి మళ్ళీ నీళ్ళు పోసుకున్నారా అని అడిగింది. నవ్వి, ఆ ఏం నీళ్ళులెద్దురూ మ ... మ్మాయి పెళ్ళీడుకొస్తే - అంది. ... మీరు మా ముసలివగ్గు అయిపోయ ...

అని అంది ఆవిడ. ఆ జయలక్షమ్మగారికి తెలిసినంతకూడ ఈయనకు తెలిసిచావదు. చిన్న దీపాలుపెట్టింతర్వాత ఆయన ఆఫీసు నుండి వచ్చేసరికి తాను వాకిట వుండటం చూచి ఆయన ముసిముసి నవ్వులు నవ్వారు. ఆయన అలా నవ్వేసరికి తనకు తలకొట్టేసినంత పనయింది. పొద్దుటమటుకు పొద్దుట చెంబులో నీళ్ళుపోస్తూ, పిల్లలెవరూ చూడకుండా, 'నెల తప్పిందనుకున్నావుకదే.'అని వెటకారంగా అన్నారు. ఆమాటకు తనకు మండుకొచ్చింది. ఈయన పయికి ఇట్లా వుంటారుగాని. ఈయనగారి దగ్గర ఎంత జాణతనం వుందనుకోవాలి. . . .

తాయారమ్మ లేచి కూర్చుని, 'అమ్మాయి సరోజా,నో రెండి పోతోంది. కాసిని మంచి నీళ్ళు పొయ్యవే-' అంది. సరోజకు వినిపించిందో వినిపించలేదోగాని గదిలోంచి బయటికి రాలేదు. డ్రాయరుమీద అద్దం పెట్టుకుని కుర్చీలో కూర్చుని తల దువ్వుకుంటోంది. ఇంకా వచ్చి మంచి నీళ్ళు పోస్తుందని కూర్చుంటే సరోజ ఎంతకీ బయటికి రాదు. సన్నగా ఏవో పాటపాడుకుంటూ, అద్దంలో తన అందాన్ని చూచి మురిసిపోతోంది.

తాయారమ్మకు ఎక్కడలేని కోపం వచ్చింది బిగ్గరగా. 'ఒసేయ్ సరూ!' అని అరిచింది. ఆ అరుపుకు సరోజ వులికిపడి బయటికి వరండాలోకి వచ్చింది.

'ఏమిటే అమ్మా పిలిచావు?' తలంటుకున్న తల చిక్కుతీసుకుంటూ అడిగింది.

'వూఁ. ఇప్పటికి వినిపించిందా? నోరెండుకు పోతోంది కాసినిమంచినీళ్లు పొయ్యవే అని జాముసేపునుంచి అరుస్తుంటే—'

"వినిపించలేదే—" అని ముందుకేసుకున్న జుట్టునంతా వెనక్కి లాక్కొని మంచినీళ్ళు తీసుకురావడానికి వంటింటి వయిపు నడిచింది.

నల్లటిమేఘాలు లాగా పిరుదులు దాటి క్రిందకు వ్రేలాడుతున్నజుట్టు, సరోజ నడుస్తున్నంతమేర వెనుకభాగాన చిమ్మచీకట్లను కల్పిస్తుంది. సరోజ విరబోసుకున్న వెంట్రుకలను చూడగానే తాయారమ్మ చేయి అప్రయత్నంగా పిడికెడుకూడా లేని తనముచ్చట ముడి పయిన పడింది.

సరోజ వయస్సంత వున్నప్పుడు తనకు ఇంతకు రెట్టింపుజుట్టువుండేది. జడవేస్తే అర చేతి వెడల్పున పట్టాలాగా ఇంతబారున వుండేది. అమ్మమ్మ తనకు మల్లెపూల జడవేస్తే ఇంట్లో అందరికని కొన్న మల్లెపూలు తన జడ వక్కదానికి సరిపోయేవి కావు. అమ్మమ్మ అనేది- మా అమ్మ ఇదేంజడే తల్లీ! వెనకటికి మామేనత్తకే చూశా. నేటికి నీకే చూశా. మా చిన్నతనంలో వేణుగోపాలస్వామి గుళ్ళో పుట్టలోవుండే సుబ్రమన్నెస్వామి అంతబారు వుంది కదే—. తనకు తలంటవల్సి వస్తే ఇక ఆరోజు అదొక పెద్ద పని. అమ్మమ్మ ఒకవయిపు ఇంత సందెగు జుట్టు వేసుకుని గూడలన్నీ పడేదాకా అంటే వాప. . . ఎక్కడికైనా ఎందుకు? తనకు పెళ్ళయి కాపురాని కొచ్చేవరకు ఆ జుట్టు వుంది. క్రొత్తలో తనజుట్టుచూచి ఆడబిడ్డల మూతులు, తోటికోడళ్ళ మూతులు వంకర్లు పోయేవి వుక్కురోషంలో. ఎటొచ్చీ ఈ పెద్దది కడుపునపడ్డ తర్వాత, టైఫాయిడ్ వచ్చి అంతజుట్టూపోయి ఆఖరికి ఇంతముడి





మిగిలింది. ఇంక ఏనాటికి వచ్చేను అంత జుట్టు. . . .

సరోజ, వంగుని తాయారమ్మ పట్టిన గ్లాసులోకి నీళ్ళు పోస్తుంటే జుట్టంతా ముందుకుపడి గ్లాసును తాకింది. తాయారమ్మ కస్సున లేచింది.

'ఏమిటాజుట్టు ముడేసుకోకూడదు?అంబకత్తిలాగా విరబోసుకున్నావు. నాకే గంపెడంత జుట్టు వుందని అందరికీ తెలియాలనా? మిట్టమధ్యాహ్నంపూట తలంటుకున్న జుట్టు అలాగే విరబోసుకుంటే ఏ దయ్యమన్నా పట్టేను—.'

పాపం, సరోజ తల్లి అన్నమాటలకు చిన్నబుచ్చుకుంది.

---

● సర్కస్ కంపెనీ మేనేజరు దగ్గరికి ఒకడు ఉద్యోగానికి వెళ్ళాడు.

"ఏమేం చెయ్యగలవోయ్ నువ్వు" అని మేనేజరు అడిగాడు.

అభ్యర్థి తన ప్రజ్ఞా విశేషాలన్నీ ప్రదర్శించాడు. సింహంలా గర్జించాడు. పులిలా గాండ్రించాడు. ఏనుగులా ఘీంకరించాడు. పందిలా ఘుర్ఘురించాడు. నక్కలా ఊళపెట్టాడు. ఇంకా రకరకాల జంతువుల, పక్షుల అరుపులు, కూతలు వినిపించాడు.

"బాగానే వుందిగాని, మా దగ్గిర ఆ జంతువులన్నీ వున్నాయి. మాకు ఇమిటేషన్లు అక్కర్లేదు. సొంతంగా ఏమైనా చెయ్యగలిగితే చెయ్యి" అన్నాడు మేనేజరు.

అభ్యర్థి దిగులుగా వెళ్ళిపోయాడు. ఒక ఏడాది అయిన తర్వాత మళ్ళీ వచ్చాడు.

"ఏమోయ్, మళ్ళీ వచ్చావు?" మేనేజరు అడిగాడు.

"కొత్త విద్య నేర్చుకున్నానండి"

"ఏమిటది?"

అభ్యర్థి చేతులు రెక్కల్లా చాచి పక్షిలా గాలిలోకి ఎగిరాడు. సర్కస్‌డేరాలో ఏ ఆధారం లేకుండా చుట్టూ పాతికసార్లు ప్రదక్షిణం చేశాడు; గాలిలో పల్టీలు కొట్టాడు. మొత్తం పావుగంటసేపు నేలమీదికి దిగకుండా ఎగిరాడు.

చిరాగ్గా మొహంపెట్టి ఇదంతా చూస్తున్న మేనేజరు విసుగుతో అన్నాడు : "ఇదివరకే చెప్పానుగదుటయ్యా, మాకు ఇమిటేషన్లు అక్కర్లేదని"





(5)

"చిక్కు తీసుకుందామని—" మెల్లగా గొణిగింది. ఇది జరిగి పదిరోజులు దాటింది.

ఒక శుక్రవారంనాటి సాయంత్రం సరోజ తన స్నేహితురాంద్రతో కలసి కనకదుర్గ గుడి కెళ్ళటానికి బయలుదేరింది. అలమరలోవున్న బాపుకు బట్టల్లోంచి సిల్కు బట్టలుతీసి కట్టుకుంది. జడ సగం అల్లి వదిలేసింది. దొడ్లోపూసిన మల్లెపూలతో దండ అల్లుకుని జడతో పెట్టుకుంది. కళ్ళనిండా ఒత్తుగా కాటుక పెట్టుకుంది. పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుంది. సుతారంగా కణతల మీదకు ముంగురులను లాగింది. మాటిమాటికి జారిపోతున్న సిల్కు పమిటను పయికి లాక్కుంటూ, జడను ముందుకేసుకుని స్నేహితురాంద్రకోసం ఇంట్లోకి బయటికి తిరుగుతోంది

సాయంకాలపు వంటపనిలో మునిగి వున్న తాయారమ్మ ఏదో పనిమీద హాలు లోకి వచ్చి కూతురును చూచింది. తన కూతురు సరోజ ఇంత అందగత్తా అనిపించింది తాయారమ్మకు. సరోజ నడిచినంత మేర వెలుగులు పారాడుతున్నాయి. అనుకోకుండా హాలులోని నిలువుటద్దంలో తన రూపాన్ని చూసుకుంది తాయారమ్మ. పీక్కుపోయిన దవడలు, లోతుకుపోయిన కళ్ళు, చెమటలు కారుతున్న వళ్ళు. అసహ్యంగా జారిపోయిన పొత్తికడుపు, లూజుగా జారిపోతున్న మెడ కండరాలు, మోటుగా జారిపోయిన చేతిజబ్బలు, బిగుతు సడలిన రొమ్ములు. . . తాయారమ్మకు ఏడుపువచ్చినంత పనయింది. కోపం, కసి, చిరాకు.

మళ్ళీ కూతురు వంక చూసింది. పయ్యారంగా గొలుసులుపట్టుకుని తూర్పుని. వుల్లాసంగా కాళ్ళు వూపుతూ వుయ్యాలబల్ల మీద వూగుతోంది. కూతురు వెలమదొరసాని లాగా వుంది. తాను పనిచేసే దాసికంటె కనా కష్టంగా వుంది. కూతురు అప్పుడే రేకులు విప్పుకున్న గులాబీ పువ్వులాగా వుంది. తాను, వడిలి, వాడి, నల్లపడిపోయిన ముద్దచింతలాగా వుంది. తాయారమ్మకు తన కూతురు గర్భవిరోధి లాగా కనిపించింది. తన ఆస్తిని కొల్లగొట్టి తనను బికారినిచేసి తన కళ్ళముందే అందలమెక్కి కులుకుతున్న ప్రత్యర్థినిలాగా వుంది. తనను వెక్కిరిస్తున్నట్లనిపించింది. తాయారమ్మ మాతృహృదయంలో—"ఆడమనసు" అసూయతో కుతకుతలాడింది. విల విల లాడింది. ఆ సమయంలో సరోజ తన కడుపునపుట్టిన కూతురు కాదు. ఆడబిడ్డ, తోడికోడలు, సవతి, గయ్యాళి అత్త. గయ్ గయ్ మనే ఇంటావిడ.

"ఏమే! నేను వంటపనితో సతమత మవుతుంటే, సాని పాపలాగా సింగారించుకుని తీరిగ్గా కూర్చున్నావు? కాస్త నాకు సాయం రాకూడదు."

సరోజ వెల వెల పోయింది.

"నీవేకదమ్మా. దుర్గగుడికెళ్ళటానంటే సరే వెళ్ళమన్నావు"

"వెళ్ళమంటే మరింకా ఇక్కడే వున్నావేం?"

"వరలక్ష్మి వాళ్ళకోసం చూస్తున్నా—"

"వెళ్ళమ్మా వెళ్ళు. నీవు నీయిష్టమొచ్చినట్లు గుళ్ళు, సినిమాలు, పేరంటాలు, స్నేహితురాళ్ళ యిళ్ళు అన్నీ చక్కబెట్టు. నేను మీఅందరికి వండివార్చిపోస్తు. వున్నానుగా, నేనొక దాసీముండను. . . మిగిలిన మంద ఎక్కడికిజేరింది? ఆడుకోటానికా? వాళ్ళకేమన్నా నీళ్లు పోసి వుతికిన గుడ్డలు తొడిగేనా? తొడగలా—తొడగవ్ ఎందుకు తొడుగుతావ్. అద్దంలో చూసుకుని మురిసిపోవటమే సరిపోతుందాయె నీకు. నీవు సినిమాస్టారులాగా సింగారించుకు కూర్చో. మిగిలిన చిన్నపిల్లలు ఎడ్డిమడ్డిగా వుంటే నీకేం? అయ్యో, అమ్మ ఇంటిపనితో ఇదవుతుంటే ఆ చిన్న పిల్లలకు నీళ్లా విప్పులూ చూద్దామే అన్న ధ్యాస నీ కుంటేగా. ఎంత సేపూ నీవళ్ళు—నీ సింగారం—నీ అద్దం. నీవు. . ."

పెట్టవలసిన నాలుగూ పెట్టి తాయారమ్మ విసురుగా లోపలకి పోయింది. పాపం. సరోజ గ్రుడ్ల నీళ్ళు గ్రుడ్లనింపుకుని ఏడుపు మొగం వేసుకుకూర్చుంది.

* * *

తాయారమ్మ వంటపని తెముల్చుకునే సరికి వీధిలోకి ఆటలు ఆడటానికి పోయిన పిల్లలందరూ బిలబిలవచ్చి పడ్డారు. "సరక్క ఏది"—"సరక్కేది" అని గంతులేశారు. గుళ్ళోకెళ్ళిందని చెప్పేసరికి, మాకు చెప్పకుండా వెళ్ళిపోయింది అనిరాగాలు మొదలు పెట్టారు. అలా నాల్గు తగలనిచ్చి వాళ్ళకు నీళ్ళుపోసింది. తనూ రెండుచెంబులు నీళ్ళు పోసుకుని, వుతికిన చీర కట్టుకుంది. బొట్టు పెట్టుకుందామని అద్దంలో మొగం చూసుకుంది. అద్దంలో తన మొగానికి బదులు ఇందాకటి సరోజ అందమయిన మొగం కనిపించి మాయమయింది. . . .మళ్ళీ తన మొగం. రక్తంలేక తెల్లగా పాలిపోయిన దిగాలు మొగం. . . .వంట్లోని రక్తమంతా మొగంలోకి పారినట్లు మొగమంతా పచ్చగా కళ కళలాడుతూంది. కళ్ళల్లోకి వెలుగులు పూరుతున్నాయి. పెదాలమీద చిరునవ్వులు జారుతున్నాయి. బుగ్గల్లో కెంపులు చిట్లుతున్నాయి. తాను ఇప్పుడు "తాయారు". 20 సంవత్సరాలకు మునుపు. 16 సంవత్సరాల "తాయారు." పేరంటానికెళ్ళివచ్చి అమ్మమ్మ చేత దిష్టితీసి పోయించుకునే "తాయారు." కరణంగారి అమ్మాయి. నాయుడమ్మ ఇల్లరికపుటల్లుడు, బస్తీలో చదువుకుంటూ శలవుల కొచ్చిన బావ, స్కూలుకు కొత్తగావచ్చిన సైన్సు కుర్ర మాష్టరు, వూరు తనికీ చేయటానికి వచ్చినప్పుడల్లా తండ్రి యింట్లో మకాంచేసే ఆర్.ఐ.—తమకంగా, వళ్ళంతా కళ్ళు చేసుకుని చూచే "తాయారు." అవతల పదివేలు కట్నం యిస్తామన్నా పెళ్ళి కొడుకును అయిదువేల కట్నానికే వప్పించగల అందంగల "తాయారు." సానికొంపల

---

● "రామాయణకాలంలో జెట్ విమానాలుండేవి."
"రుజువేమిటి ?"
"జటాయువు లేదూ ? జెట్ + ఆయువు"
"కాని, ఆయువు అంటే ఎగిరేది అని అర్థమా ?"
"కాక ? ప్రాణాలెప్పటికైనా ఎగిరిపోవా ?"

—మంత్రవాది ఉమాశంకర్

వెంట తిరిగే పెద్దన్నగారు క్రొత్తగా కాపురానికొచ్చిన తన భార్యవంక కోరచూపులు చూస్తున్నాడని భయపడి, పేచీపడిన భర్తచే వేరుకాపురం పెట్టించిన తాయారు. . . . అలాటి "తాయారు" ఈనాడు "తాయారమ్మ" అయి కన్నకూతురు అందచందాలముందు తీసికట్టుగా, ఆయింటికి దిష్టిబొమ్మగా, ఈ "మంద"కు వెట్టిచాకిరిచేసే దాసీదానిగా మిగిలిపోయింది.

ఈ ఆలోచనలతో తాయారమ్మ రోజు కంటె కాస్త ఎక్కువగా మొగానికి పౌడరు కోటా పట్టించింది. ఎప్పుడో వేడిచేసి కళ్లమంటలు పుట్టినప్పుడు పెట్టుకునేది, ఆవాళ కళ్ళకు కాటుక పెట్టుకుంది. కడగొట్టుది కడుపున పడ్డప్పుడు మానేసిన బాడీ--మళ్ళీ పాతగుడ్డల మూటనుండి ఒకబాడీని తీసింది. సైజు సరిపోలేదు. ఎలాగోబిగించి ముడేసింది. ఏమూలనో పడి దుమ్ముకొట్టుకుని వున్న సవరాన్ని వెదికితీసి, దానికి నూనె రాసి చిక్కుదీసి, దువ్వి, విడికెడుకూడలేని తన జుట్టుపాయలతో కలిపి జడ అల్లి ముడి చుట్టింది. ఇందాక సరోజ పెట్టుకోగా మిగిలిన మలెపూలను దండకట్టి, ఆ ముడిచుట్టూ చుట్టింది. జోడునయేడు తమ్ముడి పెళ్ళి కెళ్ళినప్పుడు తల్లిచేత కోరి పెట్టించుకున్న కాశ్మీరు సిల్కుచీరను, లంగా (సరోజది) పయిన కట్టింది. రోజూ సరోజ తల దువ్వుకున్న తర్వాత వెంట్రుకలను రేపుకునే పద్ధతిలో చెంప వెంట్రుకలను రేపింది.

ఇంతసేపు అమ్మ, గదిలో ఒక్కత్తే ఏం చేస్తోందా అని చూడటానికి వచ్చిన తాయారమ్మ రెండోకూతురు వనజ, తల్లిని ఎగాదిగా చూచి గబ గబ పరుగెత్తుకుంటూ హాలులోకి వెళ్ళింది. హాలులో ఆడుకుంటున్న తమ్ముళ్ళతోను,చెల్లెళ్ళతోనూ లోపలి కెళ్ళి చూడండి బలేగమ్మత్తు వుందని చెప్పింది. ఒకళ్ళతర్వాత ఒకళ్ళు లోపలి కెళ్ళి తాయారమ్మనుచూచి నవ్వుకుంటూ వస్తున్నారు. అందరికంటె ఆఖరివాడు లోపలికి తొంగిచూచివచ్చి, వంటింటి గుమ్మంలో నిలబడి —"అమ్మా, మనింటికి ఎవరో వచ్చారే. ఆగదిలోవుంది." అని అరిచాడు, తల్లి వంటింట్లోవుందని—అమాయకంగా.

అద్దంలో మొగం చూచుకుంటున్న తాయారమ్మ కొ...కుమాటవిని, ఎవరోవచ్చారనుకొని హాలులోకి వచ్చింది. హాలులోకి వచ్చిన తల్లిని ట్యూబులైటు కాంతిలో క్షుణ్ణంగాచూచి పిల్లలు నవ్వులు మొదలు పెట్టారు. "అమ్మ గమ్మత్తుగావుంది—అమ్మ గమ్మత్తుగావుంది" అనిఅరుస్తూ చుట్టూ తిరగటం మొదలు పెట్టారు.

అప్పుడే బయటనుండి లోపలికొస్తున్న తాయారమ్మ భర్త, హాలులోవున్న తాయారమ్మనుచూచి ఎవరో బయట ఆడవాళ్ళు వచ్చారని, ఒక అడుగు వెనక్కువేశాడు. అదిచూచి రెండోకూతురు వనజ నవ్వుతూ వచ్చి, 'ఎవరను కుంటున్నావు నాన్నా— అమ్మే—' అని తండ్రి చేయి పట్టుకుని లోపలికి తీసికొచ్చింది. తాయారమ్మ మొగుడు భార్యచుట్టూ తిరుగుతూ పరీక్షగా చూశాడు సీరియస్‌గా మొగంపెట్టి. పరీక్ష పూర్తిచేసి పక పక నవ్వి, 'ఓర్నీ, మీ



అమ్మేరా గోపీ!' అన్నాడు.

'అమ్మకాదు నాన్నా, బొమ్మ.' వనజ అంది.

'ఏం బొమ్మా?'—ఏం పేరు పెట్టునామూ అని సాలోచనగా అడిగాడు తండ్రి.

అందుకు గోపి సమాధానం యిచ్చాడు:

'దసరా బుట్టబొమ్మ.'

'వెరీగుడ్. దసరా బుట్టబొమ్మ'

"అమ్మ—అమ్మ—దసరా బుట్టబొమ్మ" తండ్రితోకలసి పిల్లలు చుట్టూ తిరగటం మొదలుపెట్టారు.

ఇక తాయారమ్మ అక్కడ వుండలేక పోయింది. గదిలోకివెళ్ళి తలుపులు బిడాయించుకుంది. అలంకరణ అంతా తీసిపారేసి మంచంమీద బోర్లాపడుకుంది. బయట పిల్లలూ, తండ్రికలసి అగంచేస్తున్నారు.

ఇంతలో సరోజ గుడికెళ్ళివచ్చిందట్లుంది. పిల్లలు "సరక్క" అంటూ చుట్టూమూగి తల్లిని గురించి చెప్పుకున్నారు. తాయారమ్మ బయట గొడవంతా వింటూ పడుకుంది.

"అబ్బ, ఇవాళ సరక్క బలేవుంది" అంటున్నాడు శేషు.

"ఎలావున్నా నేం?"

"మోతగావున్నావు" రాజు అన్నాడు. వెంటనే వాడివీపుమీద ఎవరో మోత పుట్టించారు.

"ఇవాళ అమ్మకూడా నీ లా గే వుం దే సరక్కా—"

"సరక్కలాగా వుండాలని అమ్మ అలా షోకు చేసుకుంది." వనజ అంటోంది.

"దానిమొగం సరూలాగా వుండాలంటే మళ్ళీ మరోజన్మ ఎత్తాలి." భర్తకంఠం.

నిజమే—మళ్ళీ ఇంకోజన్మ ఎత్తాలి. ఆ అందం, ఆ లేతదనం రోజు రోజుకి వుడిగిపోయేవేకాని మళ్ళీవచ్చేవికావు. ఇక ఈ జన్మలో మళ్ళీ "తాయారు" కాలేదు. "తాయారమ్మే!" ఇంకా నాల్గురోజులుపోతే "తాయారు మామ్మ" అవుతుంది.

సరోజ తండ్రితో ఫిర్యాదుచేస్తోంది తన మీద.

"సాని పాపలాగా సింగారించుకున్నానని ఇందాక అమ్మ నన్ను తిట్టింది నాన్నా—"

"ఏడ్చిందిలే. ఇప్పుడు తను చేసిన పనేమిటో? అమ్మ అలాగే అంటుందిలే తల్లీ. నీకేవమ్మా, లక్ష్మీదేవిలాగా వుంటావు. నీవు యింట్లోవుంటే చాలు లక్ష్మీ తాండవమాడుతుంది."

కుమార్తెను తండ్రి బుజ్జగిస్తున్నాడు.

"ఏవయస్సుకు తగ్గముచ్చట ఆవయస్సుకుండాలి, ఎందుకే పిచ్చిపిల్లా, కళ్ళనీళ్లు పెట్టుకుంటావు. లేలే, భోజనాలు చేద్దాం."

ఆయనకు తెలిసినంత తనకు తెలియక పోయింది. ఏవయస్సుకు తగ్గ ముచ్చట ఆ వయస్సునే జరగాలి. తనకు ఇంకా వచ్చే వయస్సేకాని, పోయేవయస్సు కాదుగా.

"అన్నాలు పెట్టటానికి రావే" అని పిల్లలు తలుపుకొట్టారు. తాయారమ్మ లేవలేదు.

"సరక్క పెడ్తుందిలే పదండర్రా"

అంతా వంటింట్లోకి పోయారు. సరోజ,

మడిచీరకోసం అమ్మఎక్కడపెట్టిందో అని వెతుకుతోంది. మడిచీర కట్టుకుని వడ్డన చేస్తుంది కామాలు.

"ఇప్పుడు సరక్క అమ్మలాగావుంది."
గోపి అంటున్నాడు.

"సరక్క ఎప్పుడూ సరక్కలాగే వుంటుం దేరా? అమ్మగూడ అవుతుంది-రేపు పెళ్ళి చేసుకుంటే-"

"ఫో నాన్నా-"

నిజమే. సరుకూడా రేపు పెళ్ళయి పిల్లలు పుట్టితే తనలాగే తయారవుతుంది. అదికూడ ఒక నాడు ముసలిదయిపోతుంది.

తాయారమ్మకు గుండెలమీదనుండి బరువు దింపినట్లయింది.

తాయారమ్మలోని "ఆడమనసు" మెల్ల మెల్లగా ప్రక్కకు వొదిగింది. 'తల్లిమనసు' నిండుగా పొర్లింది.

ఏమిటో పాపం చిన్నపిల్ల. ఇందాక దాన్ని అర్థమయిన తిట్లూతిట్టింది. అదిఎల్లకాలమూ ఈ యింట్లో వుండబోయి వుంటుందా? రేపు పెళ్ళయితే దానిదార్ని అది పోతుంది. నిజంగా సరూ ఎంత అందంగావుంటుంది. అమ్మలక్కలంతా నీ కూతురుకేవమ్మా బం గారపు బొమ్మ అంటారు. తన కడుపున పుట్టిన కూతురు అందంగా, ఆకర్షణీయంగా వుంటే తనకు మాత్రం అందంకాదా? అం దరూ ఫలానమ్మ కూతురమ్మా అంటారు. మొన్న వర్ధనమ్మగారు పేరంటానికి పిలవ టానికని వచ్చి సరూను చూచి.నీ నోట్లోంచి వూడిపడ్డట్టు వుండే నీ కూతురు; తల్లుల అందం కూతుర్లకు రాక ఇంకెవరికి వస్తుంది అంది. పెద్దమ్మాయిని చూస్తుంటే క్రొత్తగా కాపురానికొచ్చిన రోజుల్లో నీవు ఎలా వుండే దానివో గుర్తుకువస్తుందే-అని వాళ్ళనాన్న అన్నారు ఒకసారి. నిజంగా తన అంద మంతా కూతురుకే వచ్చింది. సరూను ఎవ రన్నా అందగత్తె అన్నారంటే అది తనను అన్నట్లే....

అందరూ అన్నాలు తిని దావిట్లోకి వచ్చారు. పిల్లలు పుస్తకాలు ముందేసుకుని పాఠాలు చదువుతున్నారు. తాయారమ్మ మెల్లగా లేచి తలుపు తీసుకుని వంట్లోంటికి వెళ్ళింది. వంటింట్లోంచి 'అమ్మాయి సరూ!' అని కేకేసింది. తల్లి పిలుపు విన్న సరోజ హాలులోంచి వంటింట్లోకి వచ్చింది. తాయా రమ్మ గుప్పెడు మిరపకాయలు కూతురు చుట్టూ గిరగిర తిప్పి దిష్టితీసి పొయ్యిలో పడేసింది.

"ఎందుకే అమ్మా ఇదంతా ?"

"ఎందుకేమిటే పిచ్చిపిల్లా. ఇందాక గుళ్ళో కెళ్ళావా ? అందరి పాపిష్టికళ్ళు నీమీదే వుంటాయి. దిష్టి తగలదే ? ఎంత మంచి చూశారో. ఏమిటో. ఒక్కొక్కళ్ళ కళ్ళు వుంటాయి—ఆ కళ్ళతో చూశారా. నల్లరాయంటిది ఫెళ్ళున పగిలి ఘూరు కుంటుంది"



# (కొత్త) బాతాఖానీ

పాఠక మహాశయులారా !

ఈ మధ్య మా పత్రికలో ముద్రణతప్పులు కొగుల్లలుగా పుట కరుస్తున్నవి. వాటిని కారణ భూతాలుగా చూపెంచి ఒక పాఠక మహాశయుడు ఈ నిద్రారాక్షసాలకు ఒక పేచీ కాటాయించ నక్కరలేదంటున్నారు. ఆ తప్పులు మేము వాంచించని క్షుద్రా రాక్షసాలు. ఇవి కోవాలని పచనము చేస్తున్నవి :

కుషితో నాస్తి దుర్భిక్షం
ఆశ లావు పీక సున్నం

కొంతమంది ఉద్యోగులు ఒక లంచంలో తినే మిత్రులు.
వడగళ్ళవాన పిల్లలకు హర్షఋతువు.
దొంగ భక్తులు కామనామ స్మరణచేస్తారు.
అప్పులవాళ్ళ నోటీసులు ఉత్త రాలు.
నెహ్రూగారి దయవల్ల కాంగ్రెసువాళ్ళ పాపాలు తెల్లబొరుతాయి.

సశేషము
ప్రాపులీడరు.